సాక్షి
కర్నూలు
సోమవారం ; 23 ; అక్టోబర్ ; 2023



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి చీరాలకు చెందిన వి.సుజాత ఆదివారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు.



కేసీకి 159 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో 0.608 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఇన్‌ఫ్లో నిలిచిపోయింది.



మంచాలమ్మకు పుష్పార్చన

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో దుర్గాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో గ్రామ దేవత మంచాలమ్మకు పుష్పార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

సంతోషంగా పండుగ జరుపుకోవాలి

- జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు, కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): దసరా పండుగను ప్రజలందరూ ఆనందోత్సవాలతో జరుపుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి, జిల్లా ఇన్ చార్జిమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖమంత్రి గుమ్మనూరు జయరాం, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయమే విజయ దశమి అని పేర్కొన్నారు.

నేటి స్పందన రద్దు

కర్నూలు(సెంట్రల్): దసరా పండుగ సందర్భంగా సోమవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరూ అర్జీలు తీసుకుని కలెక్టరేట్‌కు రావొద్దని సూచించారు.

పోలీస్ 'స్పందన' వాయిదా

కర్నూలు: దసరా పండుగ సందర్భంగా పోలీస్ 'స్పందన' కార్యక్రమాన్ని సోమవారం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎస్పీ కృష్ణకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసాలతో స్పందన కార్యక్రమానికి రావొద్దని తెలిపారు. జిల్లా ప్రజలు ఆయన దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ అంతరాయ సమస్యలపై సిబ్బంది వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఉమాపతి ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ కారణాలతో ఏర్పడే ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, బ్రేక్ డౌన్ తదితర సమస్యలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు.

అంబరాన్నంటిన సంబరం

- శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు
- మహాగౌరి స్వరూపంలో శ్రీశైల భ్రామరి
- నందివాహనంపై దేవదేవులు
- నేడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణ




శంఖం పూరిస్తున్న సాధువు

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరి క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు దేదీప్యమానంగా కొనసాగుతున్నాయి. దసరా ఉత్సవాలతో శ్రీశైలంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిస్తోంది. స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించుకుని నీరాజనాలు పడుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం భ్రమరాంబాదేవి ఉత్సవమూర్తిని మహాగౌరి స్వరూపంలో అలంకరించారు. ప్రత్యేక అలంక్రీకృత అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయం ఎదురుగా ఏర్పాటుచేసిన వేదికపై ఆశీనులను చేశారు. అర్చకులు, పండితులు విశేష పూజలు చేసి, హారతులిచ్చారు. నవదుర్గలలో మహాగౌరి రూపం అత్యంత శాంతమూర్తిగా చెప్పబడుతోంది. ఈ దేవి తెల్లని వస్త్రాలను ధరించి, చతుర్భుజాలను కలిగి ఉంటుంది. ఈ దేవిని పూజిస్తే సకల పాపాలు నశించి, కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. మహాగౌరి.. పార్వతీదేవి అవతారంలో శివుణ్ణి భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేయడంతో ఆమె శరీరం పూర్తిగా నల్లబడింది. ఆ తపస్సుకు సంతోషించి పరమేశ్వరుడు ప్రసన్నుడై ఆమె శరీరంపై గంగాజలం చల్లాడు. దీంతో ఆమె తెల్లని వర్ణాన్ని (గౌర వర్ణం)పొందింది. ఈ దేవి నాలుగు చేతులలో అభయ, వరముద్రలతో పాటు త్రిశూలం, డమరుకాలను ధరించి ఉంటుంది. ధవళ కాంతితో మెరిసే వృషభాన్ని అధిరోహించి భక్త జనకోటికి అభయప్రదానం చేస్తుంది.

శ్రీశైలంలో నేడు..

దసరా ఉత్సవాల్లో తొమ్మిదవ రోజైన సోమవారం ఉదయం భ్రమరాంబాదేవి సిద్ధిదాయిని అలంకారంలో, స్వామిఅమ్మవార్లు అశ్వవాహన సేవలో దర్శనమిస్తారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు.

పట్టువస్త్రాల సమర్పణ..

దసరా మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.


ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

నందివాహన సేవలో దేవదేవులు..

దసరా మహోత్సవాల్లో భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను నంది వాహనసేవపై అలంకరించారు. అలంకార మండపంలోకి నంది వాహనాన్ని అధిష్ఠించిన స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేయించి అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచ్చరణతో ప్రత్యేక పూజా హారతులిచ్చారు. అనంతరం మహాగౌరి దేవికి, నందీవాహనాధీశులైన దేవదేవుళ్లకు ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం, బయలువీర భద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కోలాటలు, డప్పు వాయిద్యాలు, కళాకారుల విచిత్ర వేషధారణలు, సంప్రదాయ నృత్యప్రదర్శనలతో గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. స్వామిఅమ్మవార్లను భక్తులు కన్నులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఏఈవో మోహన్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన


గిరిజనుల సంప్రదాయ నృత్యం


కోలాటం వేస్తున్న దృశ్యం

జైత్రయాత్రకు సర్వం సిద్ధం

- 24న మాళ మల్లేశ్వరుని కల్యాణోత్సవం
- ముస్తాబైన దేవరగట్టు ఆలయం
- సంప్రదాయాన్ని పాటిస్తూ బన్ని వేడుక
- భారీగా మొహరించనున్న పోలీసులు


దేవరగట్టు

హొళగుంద: దసరా బన్ని ఉత్సవాలకు దేవరగట్టు ముస్తాబైంది. విజయదశమి రోజు అర్ధరాత్రి నిర్వహించే జైత్రయాత్రకు అంతా సిద్ధం చేశారు. లక్షలాది మంది భక్తుల మధ్య అత్యంత ఉద్వేగ, ఉత్కంఠ భరితంగా బన్ని ఉత్సవం కొనసాగనుంది. తరతరాలుగా భక్తులు సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. కర్రలతో కొట్టుకోవడాన్ని రూపు మాపేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రతి యేటా ప్రయత్నిస్తోంది. ఈ ఏడాది కూడా అధికారులు కర్రలు, నాటుసారా(మద్యం)ను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. బన్ని ఉత్సవాన్ని తిలకించడానికి రాష్ట్ర నలుమూలాల నుంచే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీ ఎత్తున భక్తులు రానున్నారు.

బన్ని ఉత్సవం జరుగుతుందిలా..

నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు విజయదశమి రోజు రాత్రి భారీ సంఖ్యలో దేవరగట్టుకు చేరుకుంటారు. అక్కడ చెరువుకట్ట (డొళ్లిన బండే) వద్దకు చేరి వర్గ వైషమ్యాలు, కక్షలు, కార్పణ్యాలు లేకుండా కలిసికట్టుగా ఉత్సవాన్ని జరుపుకుందామని పాలబాస తీసుకుంటారు. కొండపై కల్యాణోత్సవానికి వస్తున్నట్లు సూచనంగా గ్రామపెద్దలు పోలీసుల వద్దకు వచ్చి బండారాన్ని ఇచ్చి వెళ్తారు. అనంతరం బాణాసంచా పేల్చి ఇనుప తొడుగులు తొడిగిన రింగు కర్రలు, అగ్గి కాగడాలు చేతపట్టి డోలు, మేళతాళాలతో కాడప్ప మఠానికి చేరి అక్కడున్న మల్లేశ్వరుని ఉత్సవ విగ్రహాన్ని కొండ(గిరి)పైకి తీసుకెళ్తారు. ఆలయంలో ఉంచిన మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహంతో పండితుల మాతమాళమ్మ, మల్లేశ్వరునికి అర్ధరాత్రి కల్యాణోత్సవం జరిపిస్తారు. అనంతరం ఉత్సవ మూర్తులను మోసుకుని జైత్రయాత్రను సాగించడానికి కొండపై నుంచి మెట్లు దిగుతుండగానే కర్రలు గాలిలో ఆడుతాయి. దివిటీలు భగ్గుమంటాయి. ఈ సమయంలో కర్రలు తగిలి ఎన్నో తలలు పగులుతాయి. నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికెరతండా, కురుకుంద, లింగంపల్లి తదితర గ్రామాల భక్తులు కల్యాణోత్సవం అనంతరం జరిగే ఈ మొగలాయిలో పాల్గొంటారు. మొగలాయిలో భక్తులు చేతుల్లో ఉన్న కర్రలు తగిలి చాలా మంది గాయపడతారు. మల్లప్ప గుడిలో మాళ మాళమ్మ, మల్లేశ్వరుని విగ్రహాలను కొద్ది సేపు అధిష్ఠించి పూజలు చేస్తారు. అనంతరం స్వామివారి విగ్రహాలతో జైత్రయాత్ర(ఊరేగింపు)ముందుకు సాగుతుంది. ఈ సందర్భంగా మొగలాయిలో భక్తులు చేతుల్లో ఉన్న కర్రలు తగిలి చాలా మంది గాయపడ్తారు. పైకి విసిరిన అగ్గి కాగడాలు మీద పడి భక్తుల ఒళ్లు కాలిపోతాయి. గతంలో కొందరు మృత్యువాత పడ్డారు. ఉత్సవాల్లో గాయపడ్డ భక్తులకు స్వామివారికి చల్లే పసుపు (బండారం) అంటిస్తారు. అనంతరం జైత్రయాత్ర ముల్లబండ, పాదాలగట్టు, రక్షపడికి చేరుకుంటుంది.

రాక్షస గుళ్లకు రక్త సంతర్పణ..

ఉత్సవ విగ్రహాలు రక్షపడికి చేరుకోగా అక్కడున్న మణి, మల్లాసుర అనే రాక్షసులుగా భావిస్తున్న రెండు రాతి గుండులకు కంచాభీరా వంశానికి చెందిన గొరువయ్య ఐదు చుక్కల రక్తాన్ని సమర్పిస్తాడు. కాలపిక్కలో దబ్బనంతో ఒకవైపు నుంచి మరోవైపు లాగడంతో వచ్చే రక్తాన్ని రాతి గుండులకు విసురుతారు. ఉదయం లోపు అక్కడ రక్తపు మరకలు ఉండవని రాక్షసులు సేవిస్తారని భక్తుల నమ్మకం.

భవిష్యవాణి

శమీ వృక్షం నుంచి విగ్రహాలు బసవన్న గుడికి చేరుకోవడంతో పూజారి, ఆలయ ప్రధాన అర్చకుడు గిరిస్వామి భక్తులకు భవిష్యవాణి వినిపిస్తారు. ఆ సమయంలో మొగలాయిని(కర్రల పట్టుకుని ఎగురడం) నిలిపి వేసి నిశ్శబ్దాన్ని పాటిస్తారు. రాబోయే కాలంలో వాణిజ్య పంటల ధరలు, ప్రకృతి వైపరీత్యాలు, రాజకీయ స్థితులు తదితర పరిస్థితులను పూజారి వివరిస్తారు. అనంతరం పూజారి భవిష్యవాణి చెప్పి బహుపరాక్... గోపరాక్ అనగానే విగ్రహాలు తిరిగి సింహాసన కట్ట వైపు ఊరేగింపుగా బయలుదేరుతాయి. ఆ సమయంలో భక్తుల మధ్య జరిగే ఊరేగింపు మరింత భయంకరంగా ఉంటుంది. అప్పుడే చాలామంది భక్తులు గాయాలపాలవుతారు. విగ్రహాలు సింహాసన కట్టకు చేరుకోవడంతో అందరూ చప్పట్లు కొట్టి జైత్రయాత్ర ముగిస్తారు.

భారీగా పోలీస్ బందోబస్తు

బన్ని ఉత్సవానికి భారీగా పోలీసులను మొహరించనున్నారు. జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో ఆదోని, నంద్యాల, కర్నూలు, డోన్, తదితర ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో కలిసి 800 మంది సివిల్ పోలీసులు, ప్రత్యేక బలగాలు, మహిళా పోలీసులు, స్పెషల్ పార్టీలతో కలిసి దాదాపు 1,200 మంది బందోబస్తు నిర్వహించనున్నారు. అల్లర్లుకు పాల్పడే వారిని గుర్తించడానికి వందకు పైగా సీసీ , డ్రోన్, వీడియో కెమెరాలు వినియోగించనున్నారు. పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించనున్నారు.

హెల్త్ క్యాంప్ ఏర్పాటు

ఉత్సవంలో గాయపడిన భక్తులకు చికిత్స అందించేందుకు దేవరగట్టులోని ఓ భవనంలో హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. డీఎంఅండ్‌హెచ్ఓ ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో డాక్టర్లు, ఆర్థోపెడిక్ సర్జన్, జనరల్ సర్జన్‌తో పాటు 100 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు. మంచాలు, మెడిసిన్స్, ఇతర అత్యవసర చికిత్సకు కావల్సిన మందులు, పరికరాలతో పాటు 108, 104 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచనున్నారు.

దేవరగట్టుకు ఇలా వెళ్లాలి

కర్నూలు నుంచి ఆలూరు మీదుగా దేవరగట్టుకు చేరుకోవచ్చు. కర్నూలుకు దేవరగట్టు 120 కి.మీ. దూరంలో ఉంది. ఆలూరుకు వచ్చి అక్కడి నుంచి అరికెర మీదుగా 14 కిమీ ప్రయాణం చేయాలి. కర్ణాటక నుంచి వచ్చే వారు హొళగుంద మీదుగా 22 కిమీ దూరం ప్రయాణించాలి. ఆలూరు, హొళగుంద వరకు బస్సు సౌకర్యాలు ఉన్నాయి. ఇక అక్కడి నుంచి ప్రైవేటు వాహనాలు, మోటర్‌సైకిళ్ల మీద వెళ్లాల్సి ఉంటుంది.


ఉత్సవమూర్తులు

రేపు బన్ని ఉత్సవం

దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవం ఈ నెల 24న మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు వీరనాగప్ప, సోమప్ప ఆదివారం విలేకరులకు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో దసరా వేడుకలను సోమవారమే జరుపకుంటున్నారని దీనివల్ల భక్తుల్లో గందరగోళం నెలకొందన్నారు. అయితే ఈ ప్రాంతంలో మంగళవారం దసరా వేడుకలు జరుపుకుంటున్నారని చెప్పారు. దేవరగట్టు బన్ని ఉత్సవం కూడా మంగళవారం రాత్రి జరపడానికి ఆలయ నిర్వాహకులు, అర్చకులు, పూజారులు నిర్ణయించి ముహూర్తాలు కూడా పెట్టినట్లు చెప్పారు. భక్తులు దీన్ని గమనించాలని సూచించారు.

ఉత్సవంలో కర్రలు ఎందుకంటే..

పూర్వం దేవరగట్టుకు బన్ని ఉత్సవాలు జరుపుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చే సమయానికి చీకటయ్యేది. అప్పట్లో రవాణా, ఇతర ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో విష కీటకాలు, జంతువుల భారీ నుంచి రక్షణ పొందేందుకు దివిటీలు, మారణాయుధాలతో భక్తులు కొండపైకి వెళ్లేవారు. స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించి ఊరేగింపు(జైత్రయాత్ర)ను వైభవంగా జరుపుకునేవారు. అయితే కొందరు గ్రామంలోని వ్యక్తిగత కక్షలతో చీకటిలో జరిగే ఊరేగింపులో తమ వెంట తెచ్చుకున్న రింగుకర్రలు, దీవిటీలు, మరణాయుధాలతో ప్రత్యర్థులపై దాడులు చేసి పగ తీర్చుకునేవారు. అలా బన్ని ఉత్సవం కర్రల సమరంగా ముద్ర పడిపోయింది. ప్రధానంగా స్వామి విగ్రహాలను తాకితే మంచి జరుగుతుందని ఉద్దేశంతో భక్తులు తమ చేతిలో ఉన్న కర్రలతో దేవుడి విగ్రహాలను తాకెందుకు పోటీ పడ్డారు. ఈ సమయంలో ఒకరి కర్రలు మరొకరి కర్రలు తగిలి శబ్దం వస్తుంది. నాటు సారా, మద్యం సేవించిన వారు చేతిలోని కర్రలు స్వాధీనంలో లేకుండా మరొకరికి తగిలి గాయాలవుతాయి. అయితే గతంలో కొందరు ఉద్దేశపూర్వకంగా గుంపులో కొట్టుకునేందుకు ప్రయతి్నంచే వారు. ఇది రక్తపాతానికి కారణమైంది. ఉత్సవాల్లో అగ్గి కాగడాలను భక్తుల పై విసరడం వల్ల ఎక్కువ శాతం కాలిన గాయాలవుతుంటాయి.


మాళ మల్లేశ్వరస్వామి ఆలయం


సింహాసన కట్ట ఉన్న మల్లప్ప గుడి


భవిష్యవాణి చెప్పేది ఈ బసవన్న గుడి మీద నుంచే..

ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ కృష్ణకాంత్



కర్నూలు: బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ కృష్ణకాంత్ విజ్ఞప్తి చేశారు. సంప్రదాయాన్ని గౌరవిస్తాం..కానీ పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బన్ని ఉత్సవానికి 1000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఏవరైనా నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లకు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా, కర్ణాటక మద్యంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విక్రయదారులపై ఇప్పటికే 15 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మద్యం అక్రమ రవాణ చేసే వారిని గుర్తించి 100 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి రక్తగాయాలు కాకుండా పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అగ్ని మాపక, వైద్య ఆరోగ్య అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



బన్ని ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు తాగునీరు, భోజన సదుపాయం కల్పిస్తున్నాం. ఇప్పటికే గట్టు రోడ్లను బాగు చేయించాం. ప్రతి ఒక్కరూ ఉత్సవాలను భక్తితో ఆనందంగా జరుపుకోవాలి. ఉత్సవాల్లో పాల్గొనే నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులతో పాటు దేవరగట్టు పరిసర గ్రామస్తులు పోలీసు నిబంధనలు పాటించాలి. – గుమ్మనూరు శ్రీనివాసులు, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్

ఈ-కేవైసీ 95.77 శాతం పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడం పూర్తి అయినప్పటికీ రైతులతో ఈ-కేవైసీ చేయించే ప్రక్రియ కొనసాగుతోంది. ఖరీఫ్ సాధారణ సాగు 10.42 లక్షల ఎకరాలు ఉండగా 10,17,590 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలను 100 శాతం ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటలను రైతులు ఈ-కేవైసీతో ధ్రువీకరిస్తేనే.. ప్రామాణికత ఏర్పడుతుంది. ఇప్పటి వరకు 3,25,722 మంది రైతులు 9,73,619 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలను ఈ-కేవైసీతో ధ్రువీకరించారు. ఇంకా 43,971 ఎకరాల్లో సాగు చేసిన పంటలను రైతులు ఈ-కేవైసీతో ధ్రువీకరించాల్సి ఉంది.

పెరిగిన ఉద్యాన పంటల సాగు

జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెరిగింది. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి కావడంతో సాగు వివరాలను ఉద్యాన శాఖ అధికారులు ప్రకటించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాధారణ సాగు 50,312.2 హెక్టార్లు ఉండగా.. ఈ-క్రాప్ బుకింగ్ ప్రకారం 87,775 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగయ్యాయి. పండ్ల తోటల సాధారణ సాగు 2,903.6 హెక్టార్లు ఉండగా 4,152.8 హెక్టార్లలో అభివృద్ధి చెందడం విశేషం. కూరగాయల సాధారణ సాగు 21,580.6 హెక్టార్లు ఉండగా 23,645.2 హెక్టార్లలో సాగైనట్లు స్పష్టమవుతోంది.











కమనీయం దుర్గాష్టమి మహోత్సవం





ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం, తిరువీధుల్లో విహరిస్తున్న ఉత్సవ మూర్తులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం దుర్గాష్టమి పూజలు విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలతో పాటు ప్రత్యేక అష్టమి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్చారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించి నవ కలశ స్థాపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం దూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. రాత్రి ఉభయ దేవురులతో శ్రీ ప్రహ్లాదవరదుడు విశేష అలంకరణలో పుష్ప పల్లకీపై కొలువుదీరి తిరువీధిలో విహరించారు. అనంతరం అద్దాల మండపంలో కొలువుంచి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఈ కార్యక్రమాన్ని ముగించారు.

విజయలక్ష్మి దీవించు



సహస్ర దీపాలంకరణ సేవలో విజయలక్ష్మి దేవి

బేతంచెర్ల: శరన్నవ రాత్రుల్లో భాగంగా వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు పాలక మండలి సభ్యులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి సహస్రదీపాలంకరణ సేవతో పాటు అమ్మవారి పంచలోహ విగ్రహం, సుదర్శన ఆళ్వార్లను ఆలయ మాడవీధుల్లో రథోత్సవంపై మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

నందవరంలో..



మహాగౌరి అలంకారంలో అమ్మవారు

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు ఆదివారం మహాగౌరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఈఓ రామానుజన్, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి దుర్గాష్టమి చండీ హోమం అష్టోత్తర శతసంఖ్య దుర్గా సూక్తపారాయణం తదితర పూజలు నిర్వహించారు. బనగానపల్లె పట్టణం కొండపేటలో వెలసిన శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

తూడిచెర్లలో మూడిళ్లల్లో చోరీ

- బంగారు, వెండి, నగదు దోచుకెళ్లిన దొంగలు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



బాధితురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ మారుతిశంకర్

జూపాడుబంగ్లా: తూడిచెర్ల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున మూడిళ్లల్లో చోరీ జరిగింది. బాధితులు, ఎస్‌ఐ మారుతిశంకర్ తెలిపిన వివరాల మేరకు...గ్రామానికి చెందిన దూదేకుల జరీనా, ఆమె భర్త బాలదస్తగిరి పిల్లలకు ఆరోగ్యం బాగోలేకపోవటంతో ఇంటికి తాళం వేసి నందికొట్కూరులో డాక్టర్ వద్ద చూపించుకునేందుకు వెళ్లారు. అక్కడ ఆలస్యం కావటంతో జరీనా దంపతులు ఆమె పుట్టినిల్లు అయిన వీపనగండ్లకు వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా తలుపులను రాడ్డుతో పెకలించి అందులో ఉన్న రూ.16వేల నగదు, రెండుతులాల బంగారు నెక్లెస్, 20 తులాల వెండి పట్టీలు, కమ్మలు, ఉంగరం దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం జరీనా దంపతులు ఇంటికి తిరిగి చేరుకోవడంతో చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. అలాగే ఇరుముస్టి జమ్ములయ్య ఇంటిలో రూ.20వేల నగదు, బంగారు కమ్మలు బుట్టాలు దోచుకెళ్లారు. వీరితో పాటు అంగన్‌వాడీ టీచర్ దేవమ్మ ఇంట్లో రూ.30 వేల నగదు బంగారు, వెండి వస్తువులు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మారుతిశంకర్ గ్రామానికి చేరుకొని చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించుకొని వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దొంగతనానికి పాల్పడిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తూడిచెర్ల గ్రామంలో ఒకే రోజు మూడు ఇళ్లల్లో దొంగలు పడి దొరికినదంతా దోచుకెళ్లిన సంఘటన ఊరంతా దావాలంగా వ్యాపించటంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

మహానందిలో మళ్లీ ఎలుగుబంటి సంచారం

మహానంది: మహానంది ఆలయం వెనుక భాగంలో ఆదివారం ఓ ఎలుగుబంటి కనిపించింది. కొద్ది రోజుల క్రితం ఓ ఎలుగుబంటిని తెలుగుగంగ క్వార్టర్స్ వద్ద పట్టుకుని అడవిలో వదిలేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ మరో ఎలుగుబంటి స్థానిక పార్వతీపురం, ఈశ్వర్‌నగర్‌లలో సంచరించి ంది. తాజాగా ఆదివారం మరో ఎలుగుబంటి కనిపించడంతో తెల్లవారుజామున విధుల కు వెళ్లే ఆలయ అర్చకులు, ఉద్యోగులు ఆందో ళన వ్యక్తం చేశారు. ఆలయం వెనుక ఉన్న చెట్లపొదల్లో కనిపించిందని స్థానికులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన శివరామ్ శ్రీనివాసులు

ఉయ్యాలవాడ: మండలంలోని తుడుమలదిన్నె గ్రామానికి చెందిన శివరామ్ శ్రీనివాసులు(50) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పొలంలో మేకలు మేపాడని తనను కులం పేరుతో దూషించి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని శ్రీనివాసులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ శ్రీనివాసులు ఆదివారం క్రిమి సంహారక మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కోవెలకుంట్ల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య మిరియాలమ్మ, కుమారుడు శ్రీకాంత్, కుమార్తె వెంకటేశ్వరమ్మ ఉన్నారు. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ సత్యనారాయణను వివరణ కోరగా కుటుంబీకుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

టీబీ డ్యాంకు నిలిచిపోయిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఆదివారం నీటి చేరిక(ఇన్‌ఫ్లో) నిలిచిపోయింది. జలాశయంలో కేవలం 39.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. డ్యాం నుంచి 9,887 క్యూసెక్కులను వివిధ కాలువలకు వదులుతున్నారు. జిల్లా సరిహద్దులోని ఎల్లెల్సీలో 420 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది.

కోసిగిలో చోరీ

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలో శనివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వర దేవాలయం సమీపంలో చల్లా శ్రీనివాసులు నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం కర్ణాటక రాష్ట్రం సింధనూరులో అత్తవారింటికి వెళ్లాడు. ఇది గమనించిన దొంగలు రాత్రిలో ఇంట్లో చొరబడి బీరువా తలుపులు పగలకొట్టి రెండుతులాల బంగారం దోచుకెళ్లారు. అలాగే ఇంటి సమీపంలో ఓంశాంతి ఆశ్రమం తలుపులు, కొల్లి పార్థసారథి ఇంటి గేటు తలుపు పగలగొట్టారు. కోసిగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ పరిశీలన



ఈవీఎం గోదాము నుంచి బయటకు వస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో కొనసాగుతున్న ఓటింగ్ పరికరాల పనితీరును పరిశీలించే ఫస్టు లెవల్ చెక్ (ఎఫ్‌ఎల్‌సీ) ప్రక్రియను కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశీలించారు. ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఆమె కేంద్రంలోకి వెళ్లి బెల్ ఇంజినీర్లు చేపడుతున్న ప్రక్రియను పరిశీలించి నిబంధనలు మేరకు ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. రాజకీయపార్టీల ప్రతినిధులకు వచ్చే అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అంతకముందు ఆమె ఎఫ్‌ఎల్‌సీ సూపర్‌వైజర్, డీపీఓ నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అంత్యక్రియలకు వెళ్లి.. చెరువులో శవమై తేలి

వెల్దుర్తి: మూడు రోజుల క్రితం రత్నపల్లె గ్రామంలో బంధువు అంత్యక్రియలకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన బోయ రంగడు (35) చెరువులో ఆదివారం శవమై తేలాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18న రత్నపల్లెలో తన బంధువైన రామకృష్ణ మృతిచెందగా బోయ రంగడు అతని అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం బంధువర్గంతో కలిసి గ్రామం ఆనుకునే ఉన్న చెరువులో స్నానానికి వెళ్లాడు. బంధువులందరూ ఇళ్లకు వచ్చినా బోయరంగడు రాలేదు. ముగ్గురు పిల్లలతో కలిసి అతని భార్య వెంకటేశ్వరమ్మ తన పుట్టినిల్లు గోవర్ధనగిరిలో ఉంటోంది. దీంతో అతను రత్నపల్లెలోని ఇంటికి రాకపోవడంపై ఎవరికీ అనుమానాలు రాలేదు. ఆదివారం తెల్లవారుజామున చెరువులో శవమై తేలిన బోయరంగడును గుర్తించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సంఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. తన భర్త బోయ రంగడు ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయి ఉంటాడని వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.













స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	232	65,398
నిఫ్టీ ▽	82	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	12,984	▽ 202
డోజోన్స్	33,127	▽ 287
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
సాంఘై	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బిఐ	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బిఐ	99.44	102.75
€	యూరో	ఎస్‌బిఐ	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బిఐ	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బిఐ	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బిఐ	59.70	61.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.24	12.31

పాత బంగారం మార్చుకుంటున్నారా?

పండుగలు అంటే కేవలం ఖర్చు చేయడమే కాదు.. భవిష్యత్‌కు 'బంగారు'బాట వేసుకోవడం కూడా. నచ్చిన గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు కొనే వారు, అందులో కొంత ఆదా చేసి భవిష్యత్ కోసం ఎందుకు ఇన్వెస్ట్ చేసుకోకూడదు? ఇలా ఆలోచించే కొందరు పండుగ సమయాల్లో బంగారం కొనుగోలు చేస్తుంటారు. బంగారం కేవలం అందాన్ని పెంచే ఆభరణం మాత్రమే కాదు, విలువను పెంచే ఆస్తి. అస్థిర తల్లో ర్యాలీ చేసే పెట్టుబడి సాధనం. కనుక పండుగ సమయాల్లో విలువ తరిగిపోయే వాటి కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టేవారు.. పసిడికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన.



- ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా?
- రెండింటికీ ఒక్కటే విధానం అనుకూలం కాదు
- అవసరమైతేనే కొత్త ఆభరణంతో మార్పిడి
- ఈ సమయంలో తయారీ, పన్నుల రూపంలో నష్టం
- పెట్టుబడి దృష్ట్యా మెరుగైన ప్రత్యామ్నాయాలు

గడిచిన కొన్నేళ్లలో బంగారం కొనుగోలు ఎన్నో మార్పులను సంతరించుకుంది. 20 ఏళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టే వారు అరుదుగా కనిపించే వారు. తర్వాత కాలంలో ఇందులో స్పష్టమైన మార్పు కనిపించింది. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా అర్థం చేసుకోవడం పెరిగింది. గతంలో బంగారంపై పెట్టుబడి అంతా భౌతిక రూపంలోనే ఉండేది. ఇప్పుడు సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, ఇప్పటికీ పెట్టుబడి దృష్ట్యా భౌతిక బంగారానికే ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ధంతేరస్ (ధనత్రయోదశి) వంటి ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు నమోదవుతుంటాయి. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యే ఆస్తుల్లో బంగారానికి మొదటి స్థానం ఉంటుంది. నేటితరం పాత బంగారాన్ని, కొత్త ఆభరణాలతో మార్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిజానికి పాత బంగారం మార్పిడితో కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం సరైనదా..? ఆభరణాలను పెట్టుబడిగా చూడొచ్చా? పెట్టుబడి కోసం ఏ రూపంలో ఇన్వెస్ట్ చేయడం మెరుగు? ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలను ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

బంగారం మార్పిడి విధానం..?

పాత బంగారు ఆభరణాలను మార్చుకోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. మార్కెట్లోకి వచ్చే కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి ఏర్పడొచ్చు. పాత నగలు డ్యామేజ్ కావొచ్చు. లేదంటే కొత్త ఆభరణాలు కొనుగోలు చేసుకోవడానికి బడ్జెట్ లేక పాత వాటిని మార్చుకోవచ్చు. కారణం ఏదైనా.. పాత బంగారం మార్చుకునే క్రమంలో కొంత నష్టపోతున్నామనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. పాత బంగారం ఆభరణాల మార్పిడికి సంబంధించి మన దేశంలో ప్రామాణిక విధానం అంటూ లేదు. వర్తకుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఆభరణం కొనుగోలు చేసిన వర్తకుడి వద్దే దాన్ని మార్చుకోవడం వల్ల గరిష్ట విలువను తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది. హాల్‌మార్క్ ఆభరణాలు అయితే బంగారం మార్కెట్ ధర మేర విలువను పొందొచ్చు. అయినా కానీ, ఆభరణాల తరుగు-తయారీ చార్జీలు అధికంగా ఉంటున్నాయి. బంగారం ధరలో 10-20 శాతం వరకు తరుగు, తయారీ చార్జీలను జ్యుయలరీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పాత ఆభరణాన్ని మార్చుకున్నప్పుడు అందులో తరుగు-తయారీ రూపంలో కొంత నష్టం ఏర్పడుతుంది. తిరిగి నూతన ఆభరణం కొనుగోలు చేయడం వల్ల, దాని తరుగు-తయారీ చార్జీల రూపంలో అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది.

కొనుగోలు చేసిన వర్తకుడి నుంచి కాకుండా, వేరొక చోట పాత ఆభరణాన్ని మార్చుకునేట్టు అయితే ప్రక్రియ వేరుగా ఉంటుంది. వర్తకులు కొందరు కొన్ని అంశాల్లో ఏకరూప విధానాన్ని అనుసరిస్తుంటే, కొన్నింటి విషయాల్లో సొంత ప్రక్రియలను అమలు చేస్తున్నారు. పాత బంగారం ఆభరణాన్ని కరిగించి, స్వచ్ఛత చూసిన తర్వాత, కొత్త ఆభరణంతో మార్చుకోవడానికి చాలా సంస్థలు అనుమతిస్తున్నాయి. ''డిజిటల్ స్కేల్ సాయంతో బంగారం ఆభరణం బరువు చూస్తారు. దీని ఆధారంగా స్వచ్ఛతను బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అనుసరించే స్వచ్ఛతలు 24 క్యారట్ (99.9 శాతం స్వచ్ఛత), 22 క్యారట్ (91.6 శాతం స్వచ్ఛత), 18 క్యారట్ (75 శాతం స్వచ్ఛత). కొందరు జ్యుయలర్లు స్క్రాచ్ (గీయడం), యాసిడ్ టెస్ట్ ద్వారా బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంటారు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్ హరీశ్.వి తెలిపారు. అన్నింటికంటే ప్రామాణికమైనది హాల్‌మార్క్ స్వచ్ఛత విధానం. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ సేవలు అందిస్తోందని, హాల్‌మార్క్ గోల్డ్ స్వచ్ఛత పరంగా విశ్వసనీయమైనదిగా హరీశ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద సంస్థలు అయితే క్యారట్‌ను కొలిచే మెషీన్లను ఉపయోగిస్తున్నాయి. వీటినే గోల్డ్ అనలైజర్ మెషీన్లు అంటున్నారు. అందులో బంగారం లేదా ఆభరణాన్ని ఉంచితే బరువు ఎంత, ప్యూరిటీ ఎంత అనే వివరాలను ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు వడోదరకు చెందిన రీనా దంపతులు ఎదుర్కొన్న అనుభవాన్ని తెలుసుకుంటే పాత బంగారం మార్పిడి ఇప్పుడు ఎంత సులభంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరివద్దనున్న 20 గ్రాముల బంగారం చైన్ తెగిపోగా, 2014లో మార్చుకుందామని అనుకున్నారు. ఓ జ్యుయలర్ వద్దకు వెళితే, కంటితో చూసి 18 క్యారట్ల బంగారం అని ఖరారు చేసి, రూ.37,500 ధర చెల్లిస్తానని చెప్పాడు. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.25,000 స్థాయిలో ఉంది. దీంతో వారు మార్చుకోలేదు. ఇటీవలే అదే చైన్‌ను ఓ వర్తకుడి వద్దకు తీసుకెళ్లగా, గోల్డ్ అనలైజర్ మెషీన్‌లో పెట్టి చూశారు. 22 క్యారెట్ల ప్యూరిటీ ఉన్నట్టు చూపించింది. దాన్ని కరిగించిన తర్వాత అసలు విలువ చెబుతానని అనడంతో, అందుకు రీనా దంపతులు ఒప్పుకున్నారు. కరిగించిన తర్వాత కూడా 22.1 క్యారెట్ నిర్ధారణ అయింది. దాంతో 10 గ్రాములకు రూ.61,000 చొప్పున విలువ కట్టారు. కొత్త ఆభరణం ధర కూడా అదే రీతిలో ఉండడంతో వారు మార్చుకునేందుకు సమ్మతించారు.

మార్చుకుంటే ఎంత కోల్పోవచ్చు..?	పాత ఆభరణం	కొత్త ఆభరణం
బరువు	20గ్రాములు	20 గ్రాములు
ధర (10 గ్రా.)	రూ.60,000 (సుమారు)	రూ.60,000
తరుగు-తయారీ చార్జీలు	లేవు	15 శాతం
పన్ను	వర్తించదు	3 శాతం
మొత్తం ధర	1,20,000	1,41,600

మార్చుకోవడం వల్ల కోల్పోయేది రూ.21,600

కొనుగోలు మార్గాలు.. చార్జీలు.. రిస్కులు

సాధనం	కొనుగోలు మార్గం	రిస్క్	చార్జీలు	కనీస పెట్టుబడి
భౌతిక బంగారం	ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలు	జాగ్రత్తగా కాపాడుకోవడం	లాకర్, తయారీ, ఇన్సూరెన్స్ వ్యయాలు	ఒక గ్రాము విలువ
డిజిటల్ గోల్డ్	యాప్స్ సాయంతో	నియంత్రణ, పర్యవేక్షణ లేదు	జీఎస్‌టీ పన్ను	రూపాయి నుంచి
గోల్డ్ ఈటీఎఫ్‌లు	షేర్ల మాదిరే, స్టాక్ ఎక్ఛేంజ్‌ల నుంచి	ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు	ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో, డీమ్యాట్ ఏఎంసీ చార్జీలు, బ్రోకరేజీ	ఒక గ్రాము నుంచి
గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్	ఏఎంసీల నుంచి, బ్రోకర్ల నుంచి	ఈటీఎఫ్‌ల మాదిరే	0.6-1.20 శాతం	రూ.100 నుంచి
ఎస్‌జీబీలు	ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు, బ్రోకర్ల సాయంతో	దాదాపుగా లేనట్టే	చార్జీల్లేవు, పైగా పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం రాబడి	రూ.5,000 నుంచి

కొత్త ఆభరణాల కొనుగోలు

బంగారం కూడా ఒక ఆస్తే. ఎవరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకైనా ఇది విలువను పెంచుతుంది. ఆభరణం కోసం కొంటున్నారా? లేక పెట్టుబడి దృష్ట్యా కొంటున్నారా? అన్న స్పష్టత అవసరం. భౌతిక బంగారం, ఆభరణాల రూపంలో ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే తరుగు-తయారీ చార్జీలు, దానిపై జీఎస్‌టీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. స్వచ్ఛతకు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. నేడు చాలా జ్యుయలరీ సంస్థలు తమ వద్దే విక్రయిస్తే 100 శాతం విలువను చెల్లిస్తున్నాయి. ఒకవేళ ఆభరణంతో మార్చుకోకుండా, నగదు కోరితే మొత్తం విలువలో 5 శాతం వరకు తగ్గించి ఇస్తున్నాయి. పన్ను కోణంలో ఇలా చేస్తున్నాయి. ''జ్యుయలరీ అనేది సెంటిమెంటల్. మనోభావాలతో ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకో తరానికి బదిలీ అవుతుంటుంది. అయితే అధిక తరుగు-తయారీ చార్జీల (10-20 శాతం)తో మార్చుకునేందుకు అయ్యే వ్యయం ఎక్కువ. దీనికితోడు జ్యుయలరీ కోసం స్టోరేజ్, లాకర్ చార్జీలను కూడా చెల్లించుకోవాల్సి రావచ్చు. భౌతిక బంగారం అయినా, ఆభరణాలు అయినా అవి వ్యక్తిగత ఆస్తులు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువకు తోడు కావు. పెట్టుబడి కోసం అయితే బంగారం కడ్డీలు లేదా కాయిన్లను కొనుగోలు చేయడం కాస్త మెరుగైనది'' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దిల్షద్ బిల్లిమోరియా సూచించారు. అయితే బంగారం కాయిన్లు, కడ్డీలను తిరిగి విక్రయించే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అంటున్నారు. ''బ్యాంక్‌లు కాయిన్లు, కడ్డీలను విక్రయించడమే కానీ, వెనక్కి తీసుకోవడం లేదు. దీంతో వీటిని బయట విక్రయించుకోవాల్సి వస్తుంది. తరుగు, కరిగించేందుకు చార్జీలను ఆ సమయంలో వసూలు చేస్తున్నారు''అని బిల్లిమోరియా వివరించారు.

ఏమిటి మార్గం..?

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే చక్కని హెడ్జింగ్ సాధనం బంగారం అని నిపుణులు చెబుతున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎవరి పోర్ట్‌ఫోలియోలో అయినా వైవిధ్యం ఏర్పడుతుందని అంటున్నారు. కాకపోతే పెట్టుబడి దృష్ట్యా అయితే ఆభరణాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను పరిశీలించాలన్నది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎస్‌జీబీలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ''చారిత్రకంగా చూస్తే బంగారం ధరలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సగటున ఏటా 5-11% మధ్య వృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం పెరిగే సమయంలో గోల్డ్ చక్కని హెడ్జింగ్ సాధనం. పెట్టుబడుల వైవిధ్యం దృష్ట్యా బంగారం ఒక మంచి పెట్టుబడి సాధనం అవుతుంది. అయితే అది కడ్డీలు లేదా జ్యుయలరీ రూపంలో ఉండకూడదు'' అని బిల్లిమోరీ సూచించారు. పీపీఎఫ్, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలు బంగారం మాదిరే వైవిధ్యానికి తోడు, మెరుగైన రాబడి, లిక్విడిటీతో ఉంటాయని చెప్పారు. కనుక పాత బంగారం మార్పిడి అనేది అవసరం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఉపయోగించని ఆభరణాలను మార్చుకుని కొత్తవి తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. పెట్టుబడి కోసం అయితే ఆభరణాలకు బదులు నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం మేలు. దీని వల్ల బంగారం విలువలో నష్టపోయే అవకాశం ఉండదు. 2010 వరకు బంగారం విలువ 10 గ్రాములు రూ.15,000 స్థాయిలోనే ఉండేది. కనుక పెట్టుబడుల దృష్ట్యా భౌతిక బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారు. కానీ, నేడు ధర గణనీయంగా పెరిగిపోవడంతో, పెట్టుబడి కోణంలో డిజిటల్ బంగారం సాధనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.



కొటక్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 4,423 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఏడాది (2023-24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24% జంప్‌చేసి రూ. 4,423 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 2,581 కోట్ల నుంచి రూ. 3,191 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 21% వృద్ధితో రూ. 6,297 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 5.22 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,314 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.08% నుంచి రూ. 1.72%కి తగ్గాయి.

అశోక్ వాస్వానికి సై: కొటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈవోగా బయటి వ్యక్తి అశోక్ వాస్వాని ఎంపికకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ నాలుగు నెలల ముందుగానే ఎండీ, సీఈవో బాధ్యతల నుంచి వైదొలగుతున్న నేపథ్యంలో అశోక్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,896 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36% జంప్‌చేసి రూ. 10,896 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ.7,558 కోట్ల నుంచి రూ. 10,261 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 31,088 కోట్ల నుంచి రూ. 40,697 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 18,308 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.31 శాతం నుంచి 4.53 శాతానికి బలపడ్డాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,861 కోట్లయ్యింది.

ఎన్‌పీఏలు డౌన్...

తాజా సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి రూ. 2.48 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.07 శాతంగా నమోదైంది.

రామ్‌కో సిమెంట్స్	షేర్‌ఖాన్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 991 టార్గెట్: రూ. 1,130



ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరల వేగవంత పెరుగుదల, ఈ ఏడాది(2023-24) రెండో త్రైమాసికం (క్యూ2) తదుపరి ఇంధన వ్యయాలు తగ్గడం వంటి అంశాల కారణంగా లబ్ధి పొందే అవకాశముంది. దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరలు అక్టోబర్ 5 నుంచి ఒక్కో బ్యాగుకి సుమారు రూ. 40 చొప్పున ఎగశాయి. వెరసి క్యూ2(జులై-సెప్టెంబర్)తో పోలిస్తే సిమెంట్ ధరలు 10 శాతం అధికంగా లభించనున్నాయి. సీజనల్‌గా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2 బలహీన కాలం అయినప్పటికీ బలమైన డిమాండ్ కనిపించింది. ఈ ట్రెండ్ పూర్తి ఏడాదిలోనూ కొనసాగే అంచనాలున్నాయి. పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాల పరిమాణంలో 20 శాతం వార్షిక వృద్ధిని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నెలలో అంతర్జాతీయ కోల్, దేశీ పెట్ కోక్ ధరలు నెలవారీగా చూస్తే 13-5 శాతం చొప్పున క్షీణించాయి. మరోవైపు ప్రాంతాలవారీగా సిమెంట్ ధరలు బలపడటంతో నిర్వహణ లాభాలు మరింత పుంజుకునేందుకు వీలుంది. నాన్‌ట్రేడ్ విభాగంపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించడం, అధిక ధరల ఉత్పత్తులు(ప్రీమియమైజేషన్), వ్యయ నిర్వహణా సామర్థ్యాలు, సిమెంటు విక్రయాలలో గరిష్ట ధరలను పొందడం, కొనసాగుతున్న పటిష్ట డిమాండు వంటి అంశాలు కంపెనీ నిర్వహణ లాభం, నికర లాభాలను భారీగా మెరుగుపరిచే అవకాశముంది. దీంతో కంపెనీ ఆర్జనలు పుంజుకోనున్నాయి. ఇది కంపెనీ రీరేటింగ్‌కు దారితీయవచ్చని భావిస్తున్నాం.

హిందాల్కో	మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 473 టార్గెట్: రూ. 570



ఎందుకంటే: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్‌కు ఒడిషాలోని హీరాకుడ్, ఆదిత్య ప్లాంట్లను ఇటీవలే సందర్శించాం. తద్వారా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మెటల్ తయారీ విధానాలు, కార్యకలాపాలను పరిశీలించాం. ఆదిత్య స్మెల్టర్ ప్లాంటు ప్రపంచంలోనే చౌక వ్యయాల, అత్యంత సమర్థవంతమైన యూనిట్లలో ఒకటిగా నిలుస్తోంది. అత్యంత ఆటోమేటిడ్ విధానంలో ఏర్పాటైన ఈ యూనిట్ కార్యకలాపాల నియంత్రణలో అతిఎక్కువ టెక్నాలజీతోపాటు, క్రేన్లు తదితరాలను వినియోగిస్తోంది. డౌన్‌స్ట్రీమ్‌లో ముడిసరుకులకు సంబంధించి ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్స్(ఎఫ్ఆర్‌పీ) విస్తరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. తద్వారా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుంది. ఇది వ్యయాల ప్రభావిత(ఆదా) సమీకృత విధానంలో భాగంకాగా.. సొంత హాట్ మిల్ సామర్థ్యం ద్వారానే ఎఫ్ఆర్‌పీ ప్రాడక్టులను రూపొందించుకోగలుగుతోంది. అత్యున్నత ఆటోమేషన్, టెక్నాలజీ వినియోగంతోపాటు.. తయారీ విధానంలో ప్రతీ చోటా వ్యయాల ఆదాకు మరింతగా ప్రయత్నిస్తోంది. తయారీలో అత్యంత రక్షణాత్మక చర్యలను అనుసరిస్తోంది. సామర్థ్యాన్ని గరిష్టంగా వినియోగించుకునే బాటలో సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా విధానాలను అవలంబిస్తోంది. పటిష్ట బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే విస్తరణ సంబంధ పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటోంది. అత్యంత సమీకృత కార్యకలాపాలు కలిగిన కంపెనీ డౌన్‌స్ట్రీమ్ సామర్థ్య విస్తరణ ద్వారా లాభాలను భారీగా పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పిల్లల ఉన్నత విద్యకు అనుకూల సాధనాలు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా? – కిరణ్

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్లు మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్ల లోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి? – విజయశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ఈక్విటీల్లోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు.

ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.